క్లుప్తంగా

కిటకిటలాడిన మూలపెద్దమ్మ ఆలయం



మూలపెద్దమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గడివేముల: కొలిచే వారికి కొంగుబంగారమై విరాజిల్లుతున్న గడివేముల మూలపెద్ద అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేకువజాము నుంచే భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ వంటి విశేష పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఈఓ రామలింగారెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట



సీబీ రాఘవరెడ్డి విగ్రహాన్ని ప్రతిష్టిస్తున్న దృశ్యం

సి.బెళగల్: మండల కేంద్రంలో మాజీ సర్పంచ్, గ్రామ పెద్ద సీబీ రాఘవరెడ్డి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా జరిగింది. స్థానిక బస్టాండ్ ఆవరణలో ఉన్న విగ్రహాన్ని ఆధునీకరించిన కుటుంబ సభ్యులు విగ్రహ పునఃప్రతిష్ట కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. స్వర్గీయ సీబీ రాఘవరెడ్డిని మండల ప్రధాతగా, సి.బెళగల్ మండలంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ఏర్పాటుకు విశేషంగా కృషి చేసిన వ్యక్తిగా ఇక్కడి ప్రజలు భావిస్తారు. సీబీ రాఘవరెడ్డి సతీమణి మాజీ సర్పంచ్ వసుంధరమ్మ, కోడలు విజయమ్మ, మనువడు ఆదిత్యరెడ్డి కార్యక్రమం చేపట్టారు. సర్పంచ్ పాండురంగన్నతో పాటు, ఎంపీటీసీ సభ్యుడు వీరన్నగౌడ్, స్థానికులు, గుండ్రేవుల, గొల్లలదొడ్డి, చింతమానుపల్లె, సంగాల తదితర గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

లొద్దిపల్లెలో టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్



బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ సునీల్‌కుమార్

ఓర్వకల్లు : మండలంలోని లొద్దిపల్లె గ్రామంలో టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ నెల 18న ఈస్టర్ పండుగను పురస్కరించుకొని స్థానిక ఏబీఎం చర్చి సంఘస్తుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలను ఎస్ఐ సునీల్ కుమార్ ప్రారంభించారు. పోటీలకు మొత్తం 40 జట్లు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గెలుపొందిన జట్లకు తొలి రెండు స్థానాలకు గాను రూ.30 వేలు, రూ.20 వేల చొప్పున నగదు బహుమతులను అందజేస్తామన్నారు. ఎస్ఐ మాట్లాడుతూ.. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా భావించాలన్నారు. కార్యక్రమంలో సంఘస్తులు కరుణ, కిరణ్, డేవిడ్, మహేష్, మధుసూదన్, గ్రామ యువకులు పాల్గొన్నారు.

క్రికెట్ విజేత ఆదోని బార్ అసోసియేషన్



విజేత జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న జడ్జి

ఆదోని రూరల్: న్యాయవాదుల క్రికెట్ టోర్నమెంట్‌లో ఆదోని బార్ అసోసియేషన్ ఘన విజయం సాధించింది. ఆదివారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ మైదానంలో ఆదోని, కర్నూలు బార్ అసోసియేషన్‌ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఆదోని జట్టు విజేతగా నిలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆదోని బార్ అసోసియేషన్ 124 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు 80 పరుగులకే ఆల్ అవుట్ అయ్యింది. విజేతలకు ఆదోని రెండో అదనపు జిల్లా జడ్జి పి.జె.సుధ ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరాములు, కార్యదర్శి జీవన్‌సింగ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పరిధిలోని ప్రజలకు స్థానిక కాలనీల్లో ఏవైనా సమస్యలు ఉంటే అర్జీల రూపంలో తమకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఉదయం 10 గంటల నుంచి ఈ కార్యక్రమం ఉంటుందని, అన్ని విభాగాల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం

- ఘనంగా శ్రీరామనవమి వేడుకలు
- గ్రామగ్రామాన రాములోరి కల్యాణం
- ఆలయాల వద్ద భక్తులకు అన్నదానం



పాణ్యంలో మంగళసూత్రాన్ని చూపుతున్న అర్చకుడు



కల్యాణం తిలకిస్తున్న భక్తులు



ఆలమూరులో ఆంజనేయస్వామి వారికి వెండి హారం అలంకరణ

పాణ్యం : శ్రీరామనవమిని పురస్కరించుకొని గ్రామగ్రామాన సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఆయా గ్రామాల్లోని సీతారాములు ఆలయాలు, ఆంజనేయస్వామి, వాల్మీకి మహర్షి ఆలయాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రమైన పాణ్యంలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు సుబ్బశాస్త్రి, ఈఓ సువర్చల ఆధ్వర్యంలో కల్యాణం కనులపండువగా జరిగింది. కల్యాణాన్ని తిలకించేందుకు గ్రామంలోని ప్రజలు, చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

➤ పాణ్యంలోని వాల్మీకి మహర్షి ఆలయంలో కల్యాణం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి వాల్మీకి మహర్షికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

➤ మండల పరిధిలోని నెరవాడ గ్రామంలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. శాస్త్రోక్తంగా అర్చకులు, దేవదాయశాఖ అధికారులు కల్యాణ తంతు జరిపించారు.

➤ పాణ్యంలోని తాటికాయ చెరువు వద్ద వెలసిన ఆంజినేయస్వామి ఆలయంలో సీతారాములు కల్యాణం వైభవంగా నిర్వహించారు.

➤ ఆలమూరు గ్రామంలోని ఆంజినేయస్వామి వారికి గ్రామానికి చెందిన ఆందిరాజ్ రాముబ్బయ్య అరకేజీ వెండి హారాన్ని బహూకరించారు.

గడివేముల: మండల కేంద్రమైన గడివేములతో పాటు, మంచాలకట్ట, పెసరవాయి, గడిగరేవుల, చిందుకూరు, బూజునూరు, దుర్వేశి గ్రామాల్లో రాములవారి కళ్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. బొల్లవరం రాములవారి ఆలయంలో శ్యాం సుందర్‌శర్మ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించి కల్యాణాన్ని జరిపించారు. అలాగే గడిగరేవుల గ్రామంలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం కనుల పండువగా జరిగింది. సాయంత్రం ఆయా గ్రామాల్లో మూల విరాట్‌లకు గ్రామోత్సవం నిర్వహించారు.

కల్లూరు : కల్లూరు అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లోని దేవాలయాల్లో సీతారాముల వారి కళ్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి కల్లూరు అర్బన్ 28వ వార్డు పందిపాడు, 37వ వార్డు వీకర్‌సెక్షన్ కాలనీ, దిన్నెదేవరపాడు గ్రామాల్లో నిర్వహించిన శ్రీ సీతారాముల కల్యాణోత్సవాల వేడుకలకు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. బస్తిపాడు, ఉలిందకొండ తదితర గ్రామాల్లో సీతారాముల కల్యాణోత్సవ వేడుకలు జరిగాయి. రాముల వారి కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ఓర్వకల్లు : శ్రీరామనవమి పర్వదినంగా సందర్భంగా మండలంలోని హుసేనాపురం, ఓర్వకల్లు, పూడిచెర్ల, లొద్దిపల్లె, కన్నమడకల, శకునాల తదితర గ్రామాలలో భక్తులు సీతారాముల కల్యాణ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో హుసేనాపురం, ఓర్వకల్లు రాముల దేవాలయాలలో ఈఓలు మద్దిలేటి, చంద్రశేఖర్‌రెడ్డి నేతృత్వంలో స్వాముల వారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు మనోహరశర్మ, విష్ణుశర్మ, అర్చకుల బృందం కల్యాణ క్రతువును జరిపించారు. స్వాముల వారి కల్యాణోత్సవం తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు పానక పందేరం, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.



తమ్మరాజుపల్లెలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



బొల్లవరం గ్రామంలో రాములోరి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



దిన్నెదేవరపాడులో సీతారాములకు పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



ఓర్వకల్లులో స్వాముల వారికి కల్యాణం జరుపుతున్న అర్చకులు



హుసేనాపురంలో కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న వేదపండితులు

కల్యాణ వైభోగమే

కోడుమూరు రూరల్: శ్రీరామనవమి పర్వదిన వేడుకలను ఆదివారం మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. కోడుమూరులోని శ్రీరాములవారి దేవాలయంలో ఎస్ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ వేడుకలను పండితులు సాంప్రదాయబద్ధంగా కన్నులపండువగా నిర్వహించారు. కల్యాణమనంతరం ఆలయ నిర్వాహకులు వందలాది మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను పల్లకీలో ఉంచి పట్టణ పురవీధుల గుండా మేళతాళాలతో ఊరేగించారు. భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి, ఎస్ఎస్‌కే సమాజ్ సంఘ సభ్యులు జీతూరి రవి, నాగరాజు, రాంప్రసాద్, బాబు, వెంకటరమణ, వీరన్న, శేఖర్, నాగేందర్, తిప్పేస్వామి, రమేష్ తదితరులున్నారు.

గ్రామాల్లో వైభవంగా సీతారాముల కల్యాణం

శ్రీరామనవమిని పురస్కరించుకొని మండలంలోని క్రిష్ణాపురం, ముడుమలగుర్తి, అమడగుంట్ల, పులకుర్తి, వర్కూరు, బైస్‌దొడ్డి గ్రామాల్లో ఆయా గ్రామాల ప్రజలు సీతారాముల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయడంతో పాటు, సాయంత్రం ఉత్సవమూర్తులను గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు.



అమడగుంట్లలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న గ్రామస్తులు



మారందొడ్డిలో సీతారాముల వారి ప్రభోత్సవం

గూడూరులో..

గూడూరు పట్టణంలోని తూర్పు బీసీ కాలనీలోని శ్రీరాములవారి ఆలయం, వాల్మీకి దేవాలయం, అంబా భవానీ ఆలయాల్లో ప్రజలు సీతారాముల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను పుట్టణ పురవీధుల గుండా ఊరేగించారు. అలాగే మండలంలోని గుడిపాడు, ఆర్.ఖానాపురం, మునుగాల గ్రామాల్లోనూ సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు.

వైభవంగా ప్రభోత్సవం

సి బెళగల్: విశ్వావసు నామ సంవత్సరం చైత్ర మాస వసంత రుతువు శుద్ధ నవమి రోజున అయోధ్య రాజు దశరథుడి ప్రథమ కుమారుడు శ్రీరాముడి కల్యాణదినం కావడంతో మండల కేంద్రంతో పాటు మారందొడ్డి, పోలకల్, కె.సింగవరం, ముడుమాల, సంగాల, పల్‌దొడ్డి, గొల్లలదొడ్డి, బురాన్‌దొడ్డి, గుండ్రేవుల కొండాపురం, కొత్తకోట, కంబదహాల్ తదితర గ్రామాలలో సీతారాముల కల్యాణ వేడుకలను ఆయా గ్రామాల పెద్దలు, భక్తులు ఘనంగా నిర్వహించారు. సి.బెళగల్‌లోని శ్రీ వాల్మీకి రామాలయంలో కొలువైన కొందడరాముల వారి కల్యాణాన్ని పురోహితులు సుదర్శనమాచార్యులు వైభవంగా నిర్వహించారు. మారందొడ్డి గ్రామంలో శ్రీరాముల వారి ఆలయంలో స్వాముల వారి కల్యాణ అనంతరం, సాయంత్రం ఉత్సవ విగ్రహాలకు ప్రభోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. సి.బెళగల్, సంగాల, కొత్తకోట గ్రామాల్లో పల్లకోత్సవం మేళతాళలతో కనులపండువగా సాగింది. పెద్దఎత్తున బాణాసంచా కాలుస్తూ సంబరంగా ఉత్సవం జరిపారు. పలు గ్రామాల్లో భక్తులకు అన్నదానం చేశారు.



సీతారాములు తలంబ్రాల వేడుక



సి.బెళగల్ శ్రీవాల్మీకి రామాలయంలో పూజలందుకుంటున్న కోదండరామస్వామి



కోడుమూరులో అన్నదానం



కోడుమూరులో సీతారాముల ఉత్సవమూర్తులు

వైభవంగా సీతారాముల పల్లకోత్సవం

కల్లూరు: శ్రీరామనవమిని పురస్కరించుకొని కర్నూలు అర్బన్‌లోని 21, 32, 41వ వార్డులలో నిర్వహించిన శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవంలో వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీతారాముల పల్లకీ ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా జోనల్ విభాగం అధ్యక్షురాలు (కార్పొరేటర్) గాజుల శ్వేతారెడ్డి, కార్పొరేటర్లు నారాయణరెడ్డి, నాగలక్ష్మి రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు యూనిస్‌బాషా, సుకుమార్, ప్రతాపరెడ్డి, భీమశంకర్‌రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, గంగులు, తదితరులు పాల్గొన్నారు.



పల్లకోత్సవంలో కాటసాని రాంభూపాల్‌రెడ్డి

రావి, వేప చెట్ల ట్రాన్స్‌ప్లాంటేషన్

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు నగరం క్రిష్ణానగర్‌లో దాదాపు ఐదు దశాబ్దాల చెట్లను మరోచోట అభివృద్ధి చేసేందుకు అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. క్రిష్ణానగర్‌లో బిల్డరొకరు ఒక పాతబడిన ఇంటిని తొలగించి కొత్త భవనం నిర్మించ తలపెట్టారు. ఈ ఇంటి ప్రాంగణంలో ఒక రావి చెట్టు, వేప చెట్టు ఉన్నాయి. భవనం కట్టాలంటే ఈ చెట్లను పూర్తిగా తొలగించాల్సి ఉంది. పచ్చని చెట్లను అలా తొలగించడం ఇష్టం లేక మరో చోట ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాలని తలపెట్టారు. ఈ.తాండ్రపాడుకు చెందిన రమేష్‌గుప్తా తన పొలంలో ఉన్న గుడి, గోశాల దగ్గర ఈ చెట్ల ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు ముందుకు వచ్చారు. దీంతో కొద్ది రోజుల క్రితమే ఈ చెట్ల కొమ్మలు తొలగించారు. విశ్రాంత డీఎఫ్‌వో జయచంద్రారెడ్డి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రమణారెడ్డి, కర్నూలు నగర పర్యావరణ సంరక్షణ విభాగ్ అధ్యక్షుడు తోట హరికృష్ణలు బిల్డరు సహకారంతో ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు శ్రీకారం చుట్టారు. రెండు చెట్లను ఆరేడు అడుగుల లోతులో ఉన్న వేర్ల వరకు క్రేన్ ద్వారా తవ్వారు. వీటిని ఈ.తాండ్రపాడుకు తరలించి రమేష్ గుప్తా పొలంలో ఏడు అడుగుల లోతులో నాటి సారవంతమైన మట్టి, నీళ్లు, వివిధ రకాల పోషకాలతో చెట్లనునాటుతారు. ఎండాకాలమైనందున రోజూ నీళ్లు పెడుతూ ఉంటే కొద్ది రోజుల్లో చిగుళ్లు వస్తాయని విశ్రాంత డీఎఫ్‌వో తెలిపారు. ఇవి పూర్వపు చెట్ల మాదిరిగా పెరుగుతాయని తెలిపారు. చెట్లను పూర్తిగా నరికి వేయకుండా మరో చోట నాటేందుకు ప్రయత్నిస్తే పర్యావరణానికి ధోకా ఉండదని తెలిపారు. ఇది తక్కువ ఖర్చుతో సాధ్యమవుతుందని పేర్కొన్నారు.



రవాణాకు సిద్ధంగా ఉన్న చెట్టు

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: మండలంలో దివ్యాంగుల ఉపయోగార్థం నిర్వహించే ఫిజియోథెరపీ క్యాంప్‌ను దివ్యాంగులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జ్యోతి ఆదివారం ప్రకటన ద్వారా సూచించారు. స్థానిక మండల భవిత కేంద్రంలో ప్రతి సోమవారం దివ్యాంగులకు శారీరక అవయవాలకు వైద్యుడు వీరేష్‌చే ఫిజియోథెరపీ నిర్వహించటం జరుగుతుందన్నారు. ప్రజలు తమ కుటుంబ సభ్యులలోని దివ్యాంగులకు భవిత కేంద్రానికి తీసుకవచ్చి, ఫిజియోథెరపీ చేయించాలని సూచించారు.

పరిష్కార వేదికకు అధికారులందరూ హాజరవ్వాలి

సి.బెళగల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులందరూ తప్పనిసరిగా హాజరవ్వాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం మండలంలోని అన్ని శాఖల అధికారులతో కలిసి పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, కార్యక్రమానికి మండల అధికారులందరూ తప్పకుండా హాజరు కావాలన్నారు. హాజరుకాని అధికారులపై చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదిక పంపడం జరుగుతుందని పేర్కొన్నారు. మండల ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని, స్థానిక సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామంలో పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకొని ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి ఆదివారం తెలిపారు. వారి నుంచి రూ.4,500 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కల్లూరు: 44వ జాతీయ రహదారిపై గొంగనపాడు వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో గొంగనపాడు గ్రామానికి చెందిన రామకృష్ణగౌడ్(38) మృతి చెందాడు. ప్రమాద సంఘటనపై ఉలిందకొండ పోలీసులు విచారిస్తున్నారు.

రమణీయం.. రథోత్సవం



వర్కూరులో అశేష భక్తజనం మధ్య రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కోడుమూరు రూరల్: మండలంలోని వర్కూరు గ్రామంలో శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం శ్రీరాములవారి రథోత్సవ కార్యక్రమాన్ని గ్రామస్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అంతకుముందు సీతారాముల కల్యాణాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించి ఉత్సవమూర్తులను రథంపై ఆశీనులను చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్ రెడ్డి, స్థానిక నాయకుడు దస్తగిరితో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రథోత్సవం ప్రారంభించారు. గ్రామస్తులు శ్రీరామచంద్ర మూర్తికి జై అంటూ పెద్ద ఎత్తున నామస్మరణ చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు. అలాగే మండలంలోని బైస్‌దొడ్డి గ్రామంలో సీతారాముల ప్రభోత్సవ కార్యక్రమాన్ని గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. కోడుమూరు ఎస్ఐ శ్రీనివాసులు ప్రభోత్సవాన్ని ప్రారంభించారు.



రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న డాక్టర్ సతీష్, రఘునాథ్‌రెడ్డి

పి.రుద్రవరంలో రాములోరి కల్యాణం

కర్నూలు(రూరల్): మండల పరిధిలో పి.రుద్రవరం గ్రామంలో రాములోరి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. కార్యక్రమంలో మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ కుటుంబ సభ్యులతో కలసి పాల్గొన్నారు. ఉదయం 11 వేడుకలు ప్రారంభంకాగా ప్రత్యేకంగా అలంకరించిన ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా గోరంట్ల మాధవ్ దంపతులు మేళతాళాలతో కల్యాణ వేదిక వద్దకు తీసుకొచ్చి ఆశీనులు గావించారు. వేదపండితుల వేదమంత్రోచ్ఛారణల మధ్య కల్యాణోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు ఎం.కే. వెంకటేష్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎమ్.కె. మధుసూదన్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కల్యాణోత్సవంలో మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ దంపతులు